క్లుప్తంగా

నేడు ప్రత్యేక పూజలు



కొడంగల్ రూరల్ : పట్టణంలోని గాడిబాయి శివాలయంలో నేడు (ఆదివారం)శివస్వాములు, భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం గాడిబాయి శివాలయం నుంచి మహాదేవుని ఆలయం వరకు స్వామివారి పల్లకీసేవ, 11గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. శివస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల నమోదు



వివరాలు తీసుకుంటున్న విద్యుత్ సిబ్బంది

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపికకు సెస్ సిబ్బంది వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల వివరాలు తీసుకుని నమోదు చేశారు. కరెంట్ బిల్లు రసీదు, ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లు, ఫోన్ నంబర్లను సేకరించి డాటా ఎంట్రీ చేపడుతున్నారు. ఇప్పటి వరకు 80శాతం డాటా ఎంట్రీ పూర్తి చేసినట్లు విద్యుత్ అధికారులు చెప్పారు. సరైన వివరాలు అందించి సెస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. డాటా ఎంట్రీలో ఏఈ మహిపాల్, లైన్‌మెన్ గోవిందు, వెంకటయ్య, తదితరులున్నారు.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి



ఎంపీడీఓను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ ఎంపీడీఓగా ఇటీవల బదిలీపై నల్గొండ జిల్లాకు వెళ్లిన ఎంపీడీఓ తిరుమలస్వామి సేవలు మరువలేనివని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ హాల్‌లో ఎంపీడీఓ తిరుమలస్వామికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమని కానీ ఎక్కడ ఉన్నా వారు ప్రజాసేవలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఎంపీడీఓను ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వీరయ్య, వెంకట్రాములు, రమేశ్ తదితరులున్నారు.

డీఎస్పీకి సన్మానం



యాలాల: డీఎస్పీని కలిసిన ఎస్ఐ శంకర్

యాలాల: తాండూరు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న బాలకృష్ణారెడ్డిని శనివారం యాలాల ఎస్ఐ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించి పూల బొకే అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అందరూ సమన్వయంతో పని చేయాలని డీఎస్పీ సూచించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాసేవే లక్ష్యంగా విధులు



ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శులు

తాండూరు రూరల్: తాండూరు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి సేవలు మరవలేనివని ప్రజాప్రతినిధులు కొనియాడారు. శనివారం బదిలీపై వెళ్లిన సుదర్శన్‌రెడ్డికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తాండూరులో నాలుగు సంవత్సరాలు పని చేసిన ఆయన విధుల పట్ల అంకితభావంతో పని చేశారని గుర్తు చేశారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను నిద్రపోనివ్వకుండా పని చేయించిన ఘనత సుదర్శన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం కొత్త ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన విశ్వప్రసాద్‌ను కూడా సన్మానించారు.

శిథిలావస్థలో కల్వర్టులు



శిథిలావస్థకు చేరుకున్న బ్రహ్మణపల్లి కల్వర్టు

దోమ : గ్రామీణ ప్రాంతాల కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామ శివారులోని కల్వర్టుతో పాటు దోమ, పాలేపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన కల్వర్టు, బాస్‌పల్లి, గొడుగోనిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరాయి. సంబంధిత అధికారులకు తెలిసినా మరమ్మతులు చేయడం లేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాలకు కల్వర్టులు గుంతలుగా మారి శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతాయోనని భయాందోళన చెందుతున్నారు. నిత్యం గ్రామాల నుంచి పట్టణలకు ప్రయాణాలు సాగిస్తుండటంతో కల్వర్టులతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే కల్వర్టు పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

ఎంపీపీ అనురాధ



లక్ష్మప్పను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

పెద్దేముల్: ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, అధికారులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని ఎంపీపీ అనురాధ రమేష్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పనిచేసి బదిలీపై వెళ్తున్న లక్ష్మయ్యకు పలు శాఖల అధికారులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులకు బదిలీలు సహజమేనని, వారు ఎక్కడికి వెళ్లి పని చేసిన ప్రజలకు సేవ చేయడంతోనే గుర్తింపు వస్తుందన్నారు. లక్ష్మప్ప నాయకులకు, పంచాయతీ కార్యదర్శులకు ఓ తండ్రిగా కలసిపోయారని, వారి సేవలు ఎన్నడు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరీష్‌కుమార్, తహసీల్దార్ కిషన్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి ,ఏఈ సిద్ధార్థ, జూనియర్ అసిస్టెంట్ అవినాష్, పీఓ బాలయ్య, ఏపీఓ బాలయ్య, మాజీ సర్పంచ్‌లు విజయమ్మ, రమేష్‌కుమార్, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం పెట్టే నైతిక హక్కు మీకెక్కడిది?

- మాజీ ఎమ్మెల్యేల ప్రోద్బలంతోనే జెడ్పీటీసీలు సంతకాలు
- కాంగ్రెస్ నేతల ధ్వజం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పి చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం పెట్టె నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులు లేదని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. శనివారం బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు మాజీ జెడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, బషీరాబాద్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, తాండూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడారు. పట్నం కుటుంబం పదేళ్ల కిందట టీడీపీలో ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ అడ్రెస్ లేదని విమర్శించారు. మహేందర్‌రెడ్డి కుటుంబం బీఆర్ఎస్‌లో చేరాకే పార్టీ బలోపేతమైందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో పట్నం కుటుంబం అనేక అవమానాలకు గురయ్యారని, అయినా ప్రజల కోసం బాధలు భరించారని చెప్పారు. మర్పల్లిలో సునితారెడ్డి వాహనంపై సొంతపార్టీ నేతల దాడి చేసినా బీఆర్ఎస్ అధిష్టానం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా సునితారెడ్డి సమర్థవంతంగా అవిశ్వాసాన్ని ఎదుర్కొంటారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొర్విచెడ్ మాజీ సర్పంచ్ వడ్డే హనుమంతు, మండల ఎస్టీసెల్ నాయకుడు బన్సీలాల్ ఉన్నారు.

నేటి నుంచి రాంపూర్‌లో ఉర్సు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ దర్గాలో నేటి (ఆదివారం) నుంచి 20 వరకు సోఫిపీర్ ఉర్సు జాతర జరగనున్నట్లు ఉర్సే షరీఫ్ దర్గా నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

శైలజారెడ్డి సేవలు అమోఘం



మోమిన్‌పేట: మోమిన్‌పేట ఎంపీడీఓ శైలజారెడ్డి బదిలీ అయ్యారు. సుమారు 8 సంవత్సరాలు విధులు నిర్వహించిన ఆమె రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి బదిలీపై వెళ్లారు. సుదీర్ఘకాలం ఎంపీడీఓగా పనిచేసి అందరి మన్నలు పొందారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

బంట్వారం: జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గత పది నెలలుగా జీపీ వర్కర్ల వేతనాల్లో నుంచి వెయ్యి రూపాయలు కట్ చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. నెలకు ఒక్కొక్కరికి రూ.9500 చెల్లించాల్సి ఉండగా, వెయ్యి తగ్గించి 8500 మాత్రమే ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రెండు నెలల పెండింగ్ వేతనాలతో పాటు పది నెలలుగా కట్ చేసిన వెయ్యి కూడా తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో జీపీ వర్కర్లకు మద్దతుగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపడుతామంటూ ఆయన హెచ్చరించారు.

కులగణన తీర్మానం చరిత్రాత్మకం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శాసనసభలో కులగణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్, రాష్ట్ర నాయకులు బి.కేశవులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, టేకుల్‌కోడ్ వెంకటయ్య ముదిరాజ్, తాలూకా నాయకులు భీమరాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 75ఏళ్లుగా బీసీ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు కులగణన చేపట్టాలని పోరాటాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కులగణనకు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం బీసీలు ముందడుగు వేసినట్లేనని అన్నారు. కులగణనను చేపట్టడంతో పాటు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో బీసీలు వెనకబడి ఉన్నారని కులగణనతో బీసీలకు న్యాయం జరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులతో కూడిన అఖిలపక్షం ఏర్పాటు చేసి కులగణనపై చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మున్నూర్ ఓంప్రకాష్, భూమిక, సునిత, నవిత, ఫయాజ్, అనిల్, కృష్ణ, అశోక్, రాజేష్, తాజుద్దీన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశ జ్యోతిర్లింగ పూజలు



శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న శివస్వాములు

కొడంగల్ రూరల్ : మండల పరిధిలోని హస్నాబాద్‌లో శనివారం ముదిగండ్ల కృష్ణ నివాసంలో శివస్వాములు భక్తిశ్రద్ధలతో ద్వాదశ జ్యోతిర్లింగ(మెట్ల) పడిపూజ నిర్వహించారు. సంకల్పం, గణపతి పూజ, శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివార్చన, శివాష్టకం, లింగాష్టకం, పంచాక్షరీ స్తోత్రం, దూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు అందిస్తూ ఘనంగా పూజలు నిర్వహించారు. రంగురంగుల పూలతో విశేష అలంకరణ, ప్రతి మెట్టుకు దీపారాధన, పూలు, పండ్లతో అలంకరించారు. అనంతరం శరణుఘోష, ఖడ్గాలతో శివస్వాములు శివనామ స్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న ఏడీఏ వినోద్‌కుమార్

ధారూరు: మండల పరిధిలోని అల్లీపూర్‌లో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎంపీడీఓ నర్సింహులు శనివారం పరిశీలించారు. అంతకుముందు ప్రత్యేక అధికారి ఏడీఏ వినోద్‌కుమార్ సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ముఖ్యమని, ఇసుక, డస్ట్ సమపాళ్లలో కలిపి నిర్ణీత ప్రమాణంలో సిమెంట్ వాడి సీసీ రోడ్లు వేయాలని సూచించారు. తర్వాత రోడ్లకు వాటర్ క్యూరింగ్ బాగా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత హన్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు 1,500 బస్తాల వేరుశనగ

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 1,026 బస్తాల వేరుశనగ వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7 వేలు, కనిష్టంగా రూ. 6,400 కొనుగోళ్లు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. అలాగే కందులు 224 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 10,100 నుంచి రూ.10,350 వరకు అమ్మకాలు జరిగినట్లు ఆమె వివరించారు.

20న బీజేపీ విజయ సంకల్పయాత్ర



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ధారూరు: మండల కేంద్రంలో 20న బీజేపీ విజయ సంకల్పయాత్ర ఉంటుందని, మండలంలోని బీజేపీ శ్రేణులంతా హాజరు కావాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల నాయకులు మాట్లాడుతూ.. తాండూరు నుంచి ధారూరు మీదుగా వికారాబాద్‌కు సంకల్పయాత్ర వెళ్తుందన్నారు. ఈ యాత్రలో కేంద్రమంత్రి, రాష్ట్ర ముఖ్యనేత పాల్గొంటారని తెలిపారు. అలాగే కోట్‌పల్లి, బంట్వారం మండల నాయకులు కూడా పాల్గొంటారని, ధారూరు అంబేడ్కర్ చౌరస్తాలో జరిగే రోడ్‌షోలో అందరు పాల్గొనాలని కోరారు. అనంతరం వికారాబాద్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా ప్రతినిధి రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు ఎం. రమేశ్, రాఘవేందర్, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పూడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి, చెంచుపల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, అజీంపటేల్, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, మాజీ సర్పంచ్ రాములు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కలప ట్రాక్టర్ పట్టివేత



అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్

తాండూరు రూరల్: అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ట్రాక్టర్ చంద్రవంచ నుంచి తాండూరుకు కట్టెల లోడుతో వెళ్తుంది. శుక్రవారం రాత్రి గౌతపూర్ శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌పై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



అంతారంలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తాండూరు రూరల్: గ్రామాల్లో గ్రామ కంఠం భూములను అక్రమిస్తే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ హెచ్చరించారు. శనివారం తాండూరు మండలం అంతారంలో డీఎల్‌పీఓ పర్యటించారు. గ్రామానికి చెందిన ఎత్తరి కృష్ణయ్య గ్రామకంఠం భూమిలో అక్రమంగా ఇంటి మెట్లు నిర్మించడంపై ఎంపీటీసీ శాంతు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ శనివారం అంతారంలో పర్యటించి పరిశీలించారు. గ్రామంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్,మాజీ సర్పంచు రాములు ఉన్నారు.

జాతర బహిరంగ వేలం వాయిదా



వేలంపాటలో పాల్గొన్న ప్రజలు

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాల్లో ఈ ఏడాది నిర్వహిస్తున్న వేలం పాట వాయిదా పడింది. శనివారం రెండోసారి బహిరంగ వేలంపాట కూడా సగమే జరిగింది. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 15వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, లడ్డూ ప్రసాదం, పులిహోర ఏడాది పాటు అమ్ముకునేందుకు వేలంపాట నిర్వహించారు. కాగా పాటదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నప్పటికీ వేలంపాట పాడటంలో పోటీ లేదు. ఏడాది పాటు టెంకాయలు అమ్ముకోవడంలో కోస్గి మండలం మీర్జాపూర్‌కు చెందిన నర్సింహులు రూ.9.91లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదం, పులిహోర అమ్ముకొనుటకు వేలంపాట బుధవారానికి వాయిదా పడిందని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

పార్టీలు మారే నాయకులకు గుణపాఠం చెప్పాలి



ఎస్‌బి.గుల్షన్

కొడంగల్ రూరల్ : పార్టీలు మారే నాయకులతో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నాయకులు పార్టీలు మారితే సామాన్య కార్యకర్తలు, నాయకుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నాయకులు బాగానే ఉంటారని, పార్టీల కోసం పనిచేసే కార్యకర్తలు ఘర్షణలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురవుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు పార్టీలు మారే నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటిరియల్ అందజేసిన సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడిలోని బాలికల సమీకృత వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థినిలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి సొంత డబ్బులతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, జంగయ్య, రాజశేఖర్, యాదగిరి, రాజు, మౌలానా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల ఎస్ఐగా అన్వేష్‌రెడ్డి



ఎస్ఐలను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

కుల్కచర్ల: మండల నూతన ఎస్ఐగా అన్వేష్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కుల్కచర్లలో విధులు నిర్వహిస్తున్న శ్రీశైలంను బంట్వారానికి బదిలీ చేశారు. వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న అన్వేష్‌రెడ్డిని కుల్కచర్లకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో అందరితో కలిసి ముందుకు సాగుతానని పేర్కొన్నారు. అనంతరం శ్రీశైలంను పూలమాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దార్శనికుడు కేసీఆర్



మోమిన్‌పేటలో కేక్‌కట్ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ తదితరులు

ప్రత్యేక తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు శనివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. పలు ఆస్పత్రుల్లో పండ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారిందని కొనియాడారు. –సాక్షి, నెట్‌వర్క్



పెద్దేముల్: మంబాపూర్‌లో..



కోట్‌పల్లిలో కేసీఆర్ బర్త్‌డే వేడుకలు



తాండూరు: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అనంతగిరి: కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



పరిగి: కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు